సాక్షి విశాఖపట్నం

సోమవారం । 26 । ఆగస్టు । 2024



ఇదేమి సర్దుబాటు! 8లో
ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఈ ప్రక్రియలో కూటమి ప్రభుత్వం ఆదిలోనే మాట తప్పింది.



కళల రాజధాని విశాఖ
సుందరమైన విశాఖ నగరం కళలకు రాజధానిగా భాసిల్లుతోందని నగర పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చి అన్నారు. 8లో



ఆర్మీ ర్యాలీకి వేళాయె.. 8లో

న్యూస్‌రీల్

స్వాగతం కృష్ణా... శరణాగతం కృష్ణా..



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

ఎంవీపీకాలనీ: హరేకృష్ణ మూమ్‌మెంట్ ఆధ్వర్యంలో ఎంవీపీకాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా గాదిరాజు ప్యాలెస్‌లో తీర్చిదిద్దిన భారీ సెట్‌లో ఆదివారం పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. రాధాకృష్ణులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. తొలిరోజు సప్తనదుల జలాలు, పంచామృతం, పండ్ల రసాలు, 108 పవిత్ర జల కలశాలతో అభిషేకం చేపట్టారు. బృందావనం నుంచి వచ్చిన లడ్డూ గోపాలుడికి మృదువైన ఉయ్యాల సేవ చేశారు. ప్రసిద్ధ సంగీత కళాకారులచే సామూహిక భజగోవిందం, 108 సార్లు హరి నామ జపం, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. వంకాలయ శృతి, శారద సుబ్రహ్మణ్యం గుమ్ములూరి, డాక్టర్ ద్వారం త్యాగరాజ్ బృందాలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రేపటి నుంచి క్రీడా దినోత్సవ పోటీలు



విశాఖ స్పోర్ట్స్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పలు క్రీడాంశాల్లో పోటీలు ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి.18–40 ఏళ్ల వారికి వంద మీటర్ల పరుగుతో పాటు బ్రిస్క్‌వాక్, వాలీబాల్, త్రోబాల్, క్యారమ్, టీటీ, చదరంగం, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు. 40–60 ఏళ్ల వారికి 50 మీటర్ల పరుగు, 300 మీటర్ల నడక, తాడు గుంజాట, ఇండోర్ ఆటలతో పాటు బ్యాడ్మింటన్ పోటీలు ఉంటాయి. 60 ఏళ్లు పైబడిన వారికి 30 నుంచి 50 మీటర్ల నడక, యోగా అంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. దీనిలో భాగంగానే పాఠశాలలు, కళాశాలల్లో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ నిర్వహించనున్నారు. ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయా జిల్లాల ప్రధాన కార్యాలయాల్లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు, విజేతలకు బహుమతులు అందజేయనున్నారు.

పారా బ్యాడ్మింటన్ కోచ్‌గా మురళీకృష్ణ

విశాఖ స్పోర్ట్స్: పారా ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత బ్యాడ్మింటన్ జట్టుకు కోచ్‌గా మురళీకృష్ణ వ్యవహరించనున్నారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు పలు అంశాల్లో పోటీలు జరగనున్నాయి. దీనిలో భాగంగా పాల్గొనే బ్యాడ్మింటన్ జట్టుకు విశాఖకు చెందిన మురళీకృష్ణ సేవలందించనున్నారు. గతంలోనూ పారా బ్యాడ్మింటన్ జట్టుకు కోచ్‌గా మురళీ సేవలందించారు. ఆయన్ని వాలీబాల్ సమాఖ్య ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే పివిజిఆర్ నాయుడు, ఒలింపియన్ మాణిక్యాలు అభినందించారు.

మహిళా కళాశాలలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో 10 పీజీ కోర్సుల్లో ఏపీపీజీ సెట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్, ఎంఏ ఎకనామిక్స్, ఎంకామ్(కామర్స్), ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్, ఎమ్మెస్సీ ఫిజిక్స్, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ బోటనీ, ఎమ్మెస్సీ మైక్రోబయాలజీ, ఎమ్మెస్సీ సైకాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు https://pgcet-sche.aptonline.in/APPGCET ద్వారా వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని కోరారు. మరిన్ని వివరాలకు 7780168423, 7032270810 నెంబర్లలో సంప్రదించవచ్చు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

అల్లిపురం: శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా నగర పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) రద్దు చేసినట్లు సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు. నగర ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

29 నుంచి ఇంటర్ యూనిట్ టెస్టు పరీక్షలు

విశాఖ విద్య: ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని జూనియర్ కాలేజీల్లో ఈ నెల 29 నుంచి రెండో యూనిట్ టెస్టు పరీక్షలు నిర్వహించాలని డీవీఈవో బి.రాధ తెలిపారు. విద్యా అకడమిక్ క్యాలెండర్‌కు అనుగుణంగా పరీక్షల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షలు పూర్తయిన తర్వాత మూల్యాంకనం చేసి, విద్యార్థులు సాధించిన మార్కులను కాలేజీల వారీగా బోర్డు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.



పని వాతావరణం సురక్షితంగా ఉండాలి

భద్రత కోసం వైద్యులు నిరసన తెలియజేయడం శోచనీయం. మహిళలకు, ముఖ్యంగా రాత్రి విధుల్లో ఉండే మహిళా వైద్యులకు పని వాతావరణం సురక్షితంగా ఉండాలి. ప్రతి ఎమర్జెన్సీ వార్డు వద్ద ఒక ఫ్రంట్ లైన్ పోలీసు సెక్యూరిటీ ఉండాలి. ఇది ముందుగా రోగి సహాయకుల ప్రవేశాన్ని నియంత్రిస్తుంది. పరామర్శకు వచ్చే వారిని పరిమిత సమయాల్లో మాత్రమే అనుమతించాలి. ఆస్పత్రుల్లో ఇంకా భద్రత పెంచాలి. వైద్యులపై దాడులకు పాల్పడిన వారిని వెంటనే శిక్షించేలా చట్టాలు రావాలి.

– డాక్టర్ సంధ్యాదేవి, గైనిక్ ప్రొఫెసర్, హెచ్‌వోడీ, ఏఎంసీ/కేజీహెచ్



కఠినమైన చట్టాలు అవసరం



మహిళా వైద్యులకు రాత్రి విధులు చాలెంజ్‌గా ఉంటున్నాయి. కోల్‌కతా కేసులో బాధితురాలికి ఇప్పటి వరకు న్యాయం జరగలేదు. ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు రూపొందించి వైద్యులపై దాడులు చేసిన వారిని వెంటనే శిక్షించాలి. ప్రస్తుతం ఉన్న సదుపాయాలు మహిళా వైద్యులు, సిబ్బందికి సరిపోవు. సౌకర్యాలు కల్పించడంతో పాటు భద్రతను పటిష్టం చేయాలి. టాస్క్‌ఫోర్స్ ఫోన్ నంబర్లను ప్రతీ వార్డులో ప్రదర్శించాలి.

– కందుల సంయుక్త, జూనియర్ వైద్యురాలు, ఆంధ్రా మెడికల్ కాలేజీ

సిటీకి ఫీవర్

- జ్వరాలతో రోగులు ఆస్పత్రులకు క్యూ
- పడకేసిన పారిశుధ్యం
- ఎక్కడికక్కడే చెత్త నిల్వలు



జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసితకాలనీ ఈదులపాక బోనంగికి చెందిన ములకలపల్లి నూక రామారావు, కళావతి జ్వరంతో బాధపడిన తమ కుమార్తె శ్రీ సాహితీ(8)ని ఇటీవల కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించగా చిన్నారికి డెంగ్యూగా నిర్ధారణ అయింది. అప్పటికే పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. ఈ సంఘటన నగరంలో ఉన్న తాజా పరిస్థితికి అద్దం పడుతోంది.



సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

మహారాణిపేట: విశాఖ నగరానికి సుస్తీ చేసింది. డెంగ్యూ దడ పుట్టిస్తోంది. వైరల్ ఫీవర్స్ భయపెడుతున్నాయి. జ్వరాలు వేగంగా విస్తరిస్తుండడంతో రోగులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఫలితంగా ప్రభుత్వాస్పత్రుల్లో ఓపీ, ఐపీ కేసులు భారీగా నమోదవుతున్నాయి. మిగతా జ్వరాలకు, డెంగ్యూ జ్వరానికి చాలా తేడా ఉంది. డెంగ్యూ జ్వరం వచ్చిన రోగిలో ప్లేట్‌లెట్లు క్షణక్షణం తగ్గిపోతాయి. సకాలంలో వైద్యం అందకపోతే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. మారిన వాతావరణ పరిస్థితులకు తోడు ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోవడం వల్ల దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఫలితంగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. యంత్రాంగం ద్వారా ఎప్పటికప్పుడు ఫీవర్ సర్వే చేసి.. జనాన్ని జాగృతం చేయాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్‌లో ఈ విషయం తేటతెల్లమైంది.

అధికారికంగా జ్వర పీడితులు ఇలా..
(జనవరి నుంచి ఆగస్టు 20 వరకు)

డెంగ్యూ పరీక్షలు చేసుకున్న వారు **3,633**

నిర్ధారణ అయింది **329**

మలేరియా పరీక్షలు చేసుకున్న వారు **1,39,303**

నిర్ధారణ అయింది **114**

జ్వరం తగ్గడం లేదు



నేను కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాను. ఉదయం వస్తోంది. సాయంత్రానికి తగ్గుతోంది. దీంతో కేజీహెచ్‌కు వచ్చాను. పరీక్షలు చేశారు. అందుకు తగ్గట్టుగా మందులు ఇచ్చారు. అయినా జ్వరం తగ్గలేదు.

– డి.జగన్నాథ్, ఎగువ రెల్లివీధి

కేసుల నమోదు ఇలా..

నెల	డెంగ్యూ	మలేరియా
మే	26	12
జూన్	48	40
జూలై	33	24
ఆగస్టు	57	09



కేజీహెచ్‌లోని రాజేంద్రప్రసాద్ వార్డులో మరుగుదొడ్ల వద్ద ఇదీ పరిస్థితి



కేజీహెచ్ వద్ద పేరుకుపోయిన చెత్త

డెంగ్యూ జ్వరాలు డేంజర్



నగరంలో డెంగ్యూ దోమలు విజృంభిస్తున్నాయి. ఇంటి ఆవరణలోని పూల కుండీలే కాదు ఇంటిపై ఉన్న ఖాళీ డబ్బాలు, టైర్లు, ఇంటికి అటు ఇటుగా ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో తాగిపడేసిన కొబ్బరి బొండాల్లో వర్షపు నీరు చేరడం, రోజుల తరబడి నిల్వ ఉండటం వల్ల దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా పూర్ణామార్కెట్ వెనుకభాగం, దొండపర్తి–లలితానగర్, వెలంపేట, రేసవానిపాలెం ఐటీ సంస్థ, ప్రసాద్‌గార్డెన్స్, రెల్లివీధి, పంజా జంక్షన్, అల్లిపురం, రామకృష్ణ జంక్షన్ రైతుబజార్, తదితర ప్రాంతాలు చెత్తతో నిండిపోయి కనిపించాయి. కాలువల్లో సకాలంలో పూడికలు తీయకపోవడం వల్ల దోమలు వృద్ధి చెంది.. జ్వరాలు విజృంభిస్తున్నాయి. వీటిలో ముఖ్యంగా డెంగ్యూ కారక ఈడిస్ ఈజిప్టై దోమలు వృద్ధి చెంది చిన్నారులు, మహిళలు, వృద్ధులపై దాడి చేస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 20 తేదీ వరకు 3,633 మందికి డెంగ్యూ పరీక్షలు చేయగా.. ఇందులో 329 మందికి డెంగ్యూ నిర్ధారణ అయింది. 1,39,303 మందికి మలేరియా పరీక్షలు నిర్వహించగా.. 114 కేసులు నమోదయ్యాయి. అనధికారికంగా ఈ సంఖ్య రెట్టింపు ఉన్నట్లు తెలుస్తోంది.

ఇవీ లక్షణాలు



జూన్, జూలైలో ప్రారంభమైన విషజ్వరాల తాకిడి ప్రస్తుతం కొనసాగుతోంది. డెంగ్యూ వచ్చిన వారిలో సహజంగానే 3 నుంచి 5 రోజుల వరకు ఆ లక్షణాలు కనిపించవు. మరికొందరిలో మాత్రం జ్వరం వచ్చిన వెంటనే లక్షణాలు కనిపిస్తాయి. డెంగ్యూ వచ్చిన వారికి 104 ఫారెన్ హీట్ డిగ్రీల జ్వరం ఉంటుంది. తలనొప్పి, కండరాలు, ఎముకలు, కీళ్ల నొప్పులు ఉంటాయి. వికారం, వాంతులు మరో ప్రధాన లక్షణం. కళ్లు మండటం, తీవ్రమైన కడుపునొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, విసుగు డెంగ్యూ జ్వరం లక్షణాలు. డెంగ్యూ జ్వరం ఉంటే శరీరంలో ప్లేట్‌లెట్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. డెంగ్యూ జ్వరానికి నిర్దిష్టమైన చికిత్స అంటూ లేదు. అందుకే ఈ లక్షణాలను బట్టి ఎప్పటికప్పుడు చికిత్స చేయించుకోవాలి. డెంగ్యూ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ప్రమాదం. ఈ లక్షణాలు ఉన్న వారు దగ్గరలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రంనకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. ప్రాథమిక పరీక్షల్లో డెంగ్యూ పాజిటివ్ వస్తే రక్త నమూనాలను ఆంధ్రా మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న మైక్రోబయాలజీ సెంటర్‌కు పంపుతున్నారు. అక్కడ పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారిస్తున్నారు.

పరిశీలన సాగిందిలా..

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచే కాకుండా చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలు, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి కేజీహెచ్‌కు ప్రతిరోజూ వందలాది మంది రోగులు వస్తుంటారు. కేజీహెచ్‌లోని రాజేంద్రప్రసాద్ వార్డు, భావనగర్ వార్డులను శనివారం 'సాక్షి' పరిశీలించగా.. పారిశుధ్యలోపం కనిపించింది. చెత్త, రోగులు వాడే వేస్టేజ్‌తో వార్డులు నిండిపోయి ఉన్నాయి. 11.30 గంటల వరకు ఇదే పరిస్థితి కనిపించింది. వార్డు పరిసరాలు కూడా అపారిశుధ్యంతో తాండవిస్తున్నాయి. రాజేంద్రప్రసాద్‌లోని డెంగ్యూ వార్డులో ఐదుగురు చికిత్స పొందుతున్నారు. భావనగర్ వార్డులో జ్వరపీడితులు ఉన్నారు.

- కేజీహెచ్‌తో పాటు నగరంలో పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెంగ్యూ జ్వర పీడితులు చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో రోజూ ఓపీకి 10 నుంచి 20 మంది జ్వర బాధితులు వస్తున్నారని సూపరింటెండెంట్ శివానంద్ తెలిపారు. ఇందులో 5 నుంచి 10 వరకు డెంగ్యూ కేసులు ఉంటున్నాయి. శనివారం ఆన్‌లైన్ ద్వారా 1,109 మంది, మాన్యువల్‌గా 209 మంది పేర్లు నమోదు చేసుకుని ఓపీ సేవలు పొందారు.
- పూర్ణామార్కెట్ వెనుక భాగం, దొండపర్తి–లలితానగర్, వెలంపేట, రేసవానిపాలెం ఐటీ సంస్థ, ప్రసాద్‌గార్డెన్స్, రెల్లివీధి, పంజా జంక్షన్, అల్లిపురం, రామకృష్ణ జంక్షన్ రైతుబజార్, తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ప్రజారోగ్యం పడకేసింది.



ఏవీఎన్ కాలేజీ వద్ద కాలువలో పేరుకుపోయిన మురుగునీరు

ప్రతి మహిళ లక్షాధికారిగా ఎదగాలి

- స్వయం సహాయక సంఘ సభ్యులకు చెక్కుల పంపిణీ
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు సత్కారం

మహారాణిపేట : స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రభుత్వం అందించే తోడ్పాటును సద్వినియోగపరుచుకొని 'లఖ్ పతి దీదీ'(లక్షాధికారులు)గా ఎదగాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆకాంక్షించారు. మహారాష్ట్రలోని జల్గావ్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగిన లఖ్ పతి దీదీ కార్యక్రమంలో కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ, స్వయం సహాయక సంఘాల సభ్యులు కలెక్టరేట్ వీసీ హాలు నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఉత్తమ ప్రతిభ కనబరిచి, ఆర్థికంగా ఉత్తమ లక్ష్యాల సాధించిన సభ్యులను కలెక్టర్, ఇతర అధికారులు సత్కరించారు. బ్యాంకు లింకేజీ ద్వారా 155 సంఘాల సహాయార్థం సమకూర్చిన రూ.14.26 కోట్ల విలువ గల మెగా చెక్కును సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటూ లక్షాధికారులుగా ఎదగాలని, మరింత మందికి చేయూత ఇస్తూ ప్రగతి సాధించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా ఉత్పత్తి అయ్యే వస్తువులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు, బ్రాండింగ్ కల్పించి ప్రచారం చేసేందుకు జిల్లా యంత్రాంగం తరఫున సహాయం అందిస్తామని పేర్కొన్నారు. విశాఖ జిల్లా నుంచి 740 మంది సభ్యులను గుర్తించాలని నిర్దేశించగా.. 1053 మంది గుర్తించామని డీఆర్‌డీఏ పీడీ శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి గణపతి, ఎల్డీఎం శ్రీనివాస్, చేనేత, జౌళి శాఖ అధికారి పద్మలత, మైక్రో ఇరిగేషన్ పీడీ, పలువురు ఏపీఎంలు, ఏరియా కో ఆర్డినేటర్లు, సీఆర్పీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ఉత్తమ లక్ష్యాలను సాధించిన సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

సీబీఆర్ఎన్ సెంటర్ ఏర్పాటులో కదలిక

- విశాఖలో వరుస ప్రమాదాల నేపథ్యంలో జోరు పెంచిన కేంద్ర ప్రభుత్వం
- గత ప్రభుత్వంలోనే విమ్స్‌లో స్థలం కేటాయింపు, అనుమతులు మంజూరు
- నెలాఖరున తుది పరిశీలనకు రానున్న కేంద్ర బృందం

బీచ్‌రోడ్డు: ఉమ్మడి విశాఖ జిల్లాలో వరుసగా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో విమ్స్‌లో కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్ అండ్ న్యూక్లియర్ (సీబీఆర్ఎన్) మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్ ఏర్పాటులో కదలిక వచ్చింది. పరిశ్రమల్లో జరిగే అగ్నిప్రమాదాల్లో క్షతగాత్రులకు మెరుగైన వైద్యం ఒకే చోట అందించేందుకు కేంద్ర ప్రభుత్వం గత ఏడాది దేశ వ్యాప్తంగా పది సీబీఆర్ఎన్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు వైద్య సంస్థలను ఎంపిక చేసింది. అందులో తెలుగు రాష్ట్రాల నుంచి విశాఖలోని విమ్స్ ఆసుపత్రి ఒకటి. దీనిపై అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వెంటనే స్పందించి సెంటర్ ఏర్పాటుకు కావలసిన రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించింది. అంతేకాకుండా సెంటర్‌కు అనుమతులను కూడా జారీ చేసింది.



స్థలాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం (ఫైల్)

తుది పరిశీలనకు రానున్న కేంద్ర బృందం

అప్పటి ప్రభుత్వం స్థలం కేటాయించడంతోపాటు అన్ని అనుమతులను మంజూరు చేయడంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ సీనియర్ ప్రాంతీయ సంచాలకులు అనురాధ ఆధ్వర్యంలో విమ్స్‌లో స్థలాన్ని పరిశీలించారు. తుది పరిశీలన కోసం ఈ నెల 28, 29 తేదీల్లో కేంద్ర, రాష్ట్ర నిపుణుల బృందం రానుంది. ఈ పరిశీలన పూర్తయితే సెంటర్ ఏర్పాటుకు మార్గం సుగమమైనట్టే.

కార్పొరేట్ ఆసుపత్రులకు స్వస్తి చెప్పవచ్చు

పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగిన ప్రతీ సారి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కార్పొరేట్ ఆసుపత్రులకు తరలించాల్సి వస్తోంది. జిల్లాలో ఇటీవల పలు పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో క్షతగాత్రులకు నగరంలోని పలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స అందించారు. అదే సీబీఆర్ఎన్ సెంటర్ ఏర్పాటైతే క్షతగాత్రులందరిని ఒకే సెంటర్‌కు తరలించి మెరుగైన వైద్యం అందించవచ్చు.

ప్రత్యేక వసతులతో మెరుగైన వైద్యం

సీబీఆర్ఎన్ సెంటర్ ఏర్పాటు అనేది పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికి సంబంధించినది. రెండు ఎకరాల స్థలంలో రెండు అంతస్తుల్లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. చికిత్సకు వినియోగించే ప్రత్యేక సామగ్రి, పరికరాలను కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తుంది. ప్రత్యేక శిక్షణ గల నిపుణులను ఇందులో నియమిస్తుంది. ఈ సెంటర్ ఏర్పాటు వల్ల ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందుతుంది.

– డాక్టర్ కె.రాంబాబు, విమ్స్ డైరెక్టర్

మంగమారిపేట బీచ్ ఆదివారం విదేశీ పర్యాటకులతో కళకళలాడింది. సర్ఫింగ్‌కు అనువైన ఈ బీచ్‌లో వారంతా సందడి చేశారు. సర్ఫర్లు అలలతో సయ్యాటలాడుతూ.. రయ్యిమంటూ తీరం వైపు దూసుకొస్తూ.. సరదాగా గడిపారు. సర్ఫింగ్ బోర్డులను ఉపయోగించి సవారీ చేశారు. సర్ఫింగ్‌కు అనువుగా ఈ బీచ్ ఉందని విదేశీయులు ఆనందం వ్యక్తం చేశారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్

• విదేశీ సర్ఫర్ల సందడి



మేహాద్రి గెడ్డలో విదేశీ విహంగాలు సందడి చేస్తున్నాయి. వేల కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ విశిష్ట అతిథులుగా వచ్చాయి. దక్షిణ చైనా, ఉత్తర థాయ్‌లాండ్‌లో విరివిగా కనిపించే గ్రేహెడెడ్ స్వాంఫెన్‌లు కనువిందు చేస్తున్నాయి. ముఖ్యంగా చిత్తడి నేలల్లో, కలుపు మొక్కల్లో తిరుగుతూ ఆహారాన్ని సేకరించే ఈ పక్షులను చూసేందుకు స్థానికులు వస్తున్నారు.

ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్

• విదేశాల్లో తేలి.. మేహాద్రిలో వాలి.!



27న బార్క్ డైరెక్టర్ రాక

మహారాణిపేట : బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ వివేక్ భాసిన్ ఈనెల 27న విశాఖ వస్తున్నారు. ముంబయి నుంచి మంగళవారం 3.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నరసింహనగర్‌లో ఉన్న బార్క్‌కు చేరుకుని అక్కడ బస చేస్తారు. 28న అచ్యుతాపురం వెళ్తారు. 29న మధ్యాహ్నం 2.30 గంటలకు విమానంలో హైదరాబాద్ వెళ్తారు.



సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలి. మహిళా వైద్యులకు ఆస్పత్రుల్లో రక్షణ ఉండాలి. సీసీ కెమెరాలు అన్ని చోట్ల ఏర్పాటు చేయాలి. వార్డులో పని చేసే పీజీ, జూనియర్ వైద్యులు తీవ్రమైన ఒత్తిడితో విధులు నిర్వర్తింటారు. మహిళా వైద్యుల రక్షణకు సుప్రీంకోర్టు సూచనలను కచ్చితంగా అమలు చేస్తే ప్రయోజనం ఉంటుంది. భద్రతతో పాటు చట్టాలను పటిష్టం చేయాలి. మహిళా డాక్టర్లలో ఆత్మ విశ్వాసం పెరగాలంటే సమాజం నుంచి కూడా మద్దతు అవసరం.

– డాక్టర్ అంపోలు అచ్యుతరావు, ప్రొఫెసర్, ఆర్థోపెడిక్ రెండో యూనిట్, కేజీహెచ్





పటిష్ట చట్టాలు రూపొందించాలి

రోగుల ప్రాణాలను కాపాడేందుకు వైద్యులతోపాటు నర్సులు కూడా తీవ్రంగా శ్రమిస్తారు. నర్సులు ఎప్పుడు రోగి, బంధువులకు సహాయకారిగా ఉంటారు. కానీ ఒక్కో సందర్భంలో రోగులు, వారి బంధువుల నుంచి ఇబ్బందులు పడుతుంటాం. అందుకే నర్సులకు అవసరమైన భద్రత ఉండాలి. రాత్రి సమయంలో ఎక్కువగా వార్డులో ఉండేది నర్సులే. వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తే.. భయం లేకుండా పనిచేస్తారు. మా భద్రతకు ఇంకా పటిష్టమైన చట్టాలను రూపొందించాలి.

– టి.ఎస్.కల్పన మౌళి, గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్ కేజీహెచ్

మానవతావాది సింహాద్రప్పడు

ఘనంగా సంస్మరణ సభ



సింహాద్రప్పడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీలు రఘువర్మ, వరప్రసాద్ తదితరులు

మురళీనగర్: ఉపాధ్యాయ ఉద్యమ సింహం దివంగత గుల్లిపల్లి సింహాద్రప్పడు గొప్ప మానవతావాది అని వక్తలు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో ఆదివారం సింహాద్రప్పడు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, పాకలపాటి రఘువర్మ, ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి పాండురంగ వరప్రసాద్ మాట్లాడారు. సింహాద్రప్పడు ఆశయాలను నెరవేరుద్దామంటూ వారు తీర్మానించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల హక్కులను కాపాడుకుంటూనే బాధ్యతల కోసం నిలబడతామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు సింహాద్రప్పడు నిరంతరం కృషి చేశారని వారు చెప్పారు. విశాఖ జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు చుక్కా కరుణాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా సింహాద్రప్పడు చిత్రపటానికి ఎమ్మెల్సీలు, ఏపీటీఎఫ్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అన్నమయ్య యూనివర్సిటీ మాజీ వీసీ ముత్రుముత్రాలనాయుడు, జోన్–1 ఆర్‌జేడీ బి.విజయభాస్కర్, ఏపీటీఎఫ్ విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కార్యదర్శులు, వందలాది మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళల రాజధాని విశాఖ



సీపీ బాగ్చిని సత్కరిస్తున్న వీఎండీఏ ప్రతినిధులు

మద్దిలపాలెం: సుందరమైన విశాఖ నగరం కళలకు రాజధానిగా, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు నిలయంగా భాసిల్లుతోందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ 38వ వార్షికోత్సవంలో భాగంగా రెండవ రోజు ఆదివారం కార్యక్రమాన్ని వీఎండీఏ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, ప్రముఖ హిందుస్తానీ సంగీత విద్వాంసురాలు మీతా పండిట్, స్వామి విశ్వేశానంద, హరిప్రియపనందాలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాకారులను ఘనంగా సత్కరించి మాట్లాడారు. సువిశాలమైన విశాఖ నగరం అందానికే కాదు.. మన సంప్రదాయాలకు, సాంస్కృతికి నిలువుటద్దంగా ఉందన్నారు. ఎందరో మహానుభావుల ప్రతిభను ప్రదర్శించిన వేదికగా కళాభారతి ఆడిటోరియం నిలుస్తుందన్నారు. అనంతరం మీతా పండిట్ గాత్ర కచేరీ ప్రేక్షకులను అలరించింది. కార్యక్రమంలో పైడా కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇదేమి సర్దుబాటు!

- సర్‌ప్లస్ పేరుతో అసంబద్ధ బదిలీలు
- ఉపాధ్యాయుల్లో తీవ్ర వ్యతిరేకత
- జిల్లాలో 409 మంది మిగులు ఉపాధ్యాయులు
- విద్యా సంవత్సరం మధ్యలో ఎక్కడికి వెళ్లాలని ఆవేదన
- గళం విప్పకుండా ఉపాధ్యాయ సంఘాలపై ఒత్తిళ్లు
- ఎంటీఎస్ టీచర్లకూ తప్పని సర్దుపోటు



జీవీఎంసీ గాంధీ విగ్రహం నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు (ఫైల్)

విశాఖ విద్య : ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ముందుకు సాగడంలేదు. తాము అధికారంలోకి వస్తే ఉపాధ్యాయులకు అనుకూలంగా ఉంటామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆదిలోనే మాట తప్పింది. ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో ఉపాధ్యాయుల 'సర్దుబాటు ప్రక్రియ ఒక అడుగు ముందుకి నాలుగు అడుగులు వెనక్కి' అన్న చందాన సాగుతుంది. ఫలితంగా స్కూళ్లలో పాఠ్యాంశాల బోధన సవ్యంగా సాగక విద్యార్థులు చదువుల్లో వెనుకబడిపోతున్నారు.

అంతా గందరగోళం

ఉపాధ్యాయుల సర్దుబాటు అనేది ఏటా జరిగేదే. ఆయా పాఠశాల అవసరాల మేరకు మండల స్థాయిలో ఎంఈవో ఈ ప్రక్రియను పూర్తి చేస్తుంటారు. కానీ కూటమి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు ఉపాధ్యాయులకు చేటు తెచ్చిపెట్టాయి. ఉపాధ్యాయుల సర్దుబాటుపై జారీ చేసిన ఉత్తర్వులను రెండు సార్లు మార్చినప్పటికీ ఉపాధ్యాయులు నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతూనే ఉంది. సర్‌ప్లస్ పేరిట సిద్ధం చేసిన జాబితాలపై కూడా ఉపాధ్యాయులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. మినిమమ్ టైం స్కేల్(ఎంటీఎస్)తో పనిచేస్తున్న వారిని సైతం మిగులు ఉపాధ్యాయుల జాబితాలో చేర్చి, బదిలీలకు సిద్ధమవుతుండటంతో వారిలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

మిగులు ఉపాధ్యాయుల్లో గుబులు

జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లు అన్ని క్యాడర్లు కలుపుకొని 409 మంది ఉపాధ్యాయులు సర్‌ప్లస్‌గా ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు లెక్క తేల్చారు. తొలుత మండల స్థాయిలో సర్దుబాటు చేసి, ఇంకా మిగులు ఉపాధ్యాయులు ఉన్నట్లయితే, వారిని డివిజన్‌లోని ఇతర మండలాల్లో గల పాఠశాలలకు పంపిస్తారు. ఇదే మిగులు ఉపాధ్యాయులకు ఆందోళన రేకెత్తిస్తుంది. ఉదాహరణకు చినగదిలి మండలంలో 81 మంది మిగులు ఉపాధ్యాయులు ఉండగా, అక్కడ 13 మందే సర్దుబాటుకు అవకాశం ఉంది. మిగిలిన 68 మంది ఉపాధ్యాయులు భీమిలి డివిజన్‌లోని ఏ మండలానికైనా వెళ్లాల్సి ఉంటుంది. నగరంలో పని చేస్తున్న తమను ఇలా అర్ధాంతరంగా ఎక్కడికి పంపిస్తారో తెలియక ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.

కుంటుపడుతున్న చదువులు

జిల్లాలోని గోపాలపట్నం మండలం బుచ్చిరాజుపాలెం యూపీఎస్‌లో 340 మంది విద్యార్థులు ఉన్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్లు ఏడుగురు, స్కూల్ అసిస్టెంట్లు నలుగురు పనిచేస్తున్నారు. ప్రాథమిక తరగతుల్లోని విద్యార్థుల సంఖ్యను పరిగణలోకి తీసుకొని ఇక్కడ నలుగురు ఎస్జీటీలు సర్‌ప్లస్‌గా ఉన్నట్లు విద్యాశాఖాధికారులు ప్రకటించారు. కానీ ఇప్పటికే ఇక్కడ ఫిజికల్ సైన్సు, బయాలజీ, హిందీ సబ్జెక్టులను బోధించే ఉపాధ్యాయులు లేదు. జిల్లాలోని చాలా స్కూళ్లలో ఇదే పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం సాగదీత ధోరణితో అవసరమైన చోట కూడా ఉపాధ్యాయులు లేక, స్కూళ్లలో చదువులు కుంటుపడుతున్నాయి.

ఉపాధ్యాయ సంఘాలపై ఒత్తిళ్లు

సర్దుబాటు ప్రక్రియలో ప్రభుత్వం తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలపై ఉపాధ్యాయుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో సంఘాల నాయకులు తమ గళం వినిపించక తప్పటం లేదు. ఈ నేపథ్యంలోనే కొంతమంది ఉపాధ్యాయులు రోడ్డు ఎక్కారు. జీవీఎంసీ ఎదురుగా గల గాంధీ విగ్రహం ముందు ప్లకార్డులతో నిరసన తెలిపారు. మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఆందోళనకు సైతం పిలుపునిచ్చింది. అయితే సంఘాల నాయకులకు పై స్థాయి నుంచి బెదిరింపులు వస్తున్నట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తాల్సిన సంఘాల నాయకులు ఇలాంటి పరిణామాలతో వెనక్కి తగ్గుతున్నారు. ఫలితంగా ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలుగుతుంది.

మండలాల వారీగా ఇదీ పరిస్థితి

మండలం	మిగులు ఉపాధ్యాయులు	అవసరం ఉన్నది
ఆనందపురం	32	10
భీమునిపట్నం	45	45
చినగదిలి	81	13
గాజువాక	33	6
గోపాలపట్నం	43	23
ములగాడ	15	4
పద్మనాభం	24	6
పెదగంట్యాడ	21	6
పెందుర్తి	65	16
సీతమ్మధార	28	23
మహారాణిపేట	22	33
	409	185

ప్రాథమిక విద్యకు విఘాతం



పని సర్దుబాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఇప్పటికే ఫ్యాప్టో పక్షాన దీన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించాం. పాఠశాలల్లో సమస్యలపై దిద్దుబాటు లేకుండా సర్దుబాటు చేయటం వల్ల ప్రాథమిక విద్యకు తీవ్ర విఘాతం కలుగుతుంది. డీఎస్సీ ఆలస్యమవుతున్నందున హైస్కూళ్లలో బోధనకు ఆటంకం లేకుండా తాత్కాలికంగా అకడమిక్ ఇనస్ట్రక్టర్లను నియమించాలి. దీనివల్ల ఉపాధ్యాయ శిక్షణ పొందిన నిరుద్యోగులకు మేలు జరుగుతుంది.

– టి.ఆర్.అంబేడ్కర్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

పదోన్నతులు ఇవ్వాలి



జీవో నెంబర్ 117ను రద్దు చేయాలి. ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ల కొరత ఉన్నందున, గతంలో మాదిరే అర్హత గల ఎస్జీటీలకు నెలవారీ పదోన్నతులు కల్పించాలి. ఆ ఖాళీలను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలి. ఏ మేనేజ్‌మెంట్‌కు చెందిన ఉపాధ్యాయులను అదే మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో సర్దుబాటు చేయాలి. అంతవరకు సర్దుబాటు ప్రక్రియను నిలిపివేయాలి.

– కె.శ్రీనివాస్, ఏపీటీఎఫ్, రాష్ట్ర కార్యదర్శి





క్యూలో అభ్యర్థులు



ఆర్మీ ర్యాలీకి వేళాయె

సాక్షి, విశాఖపట్నం : అగ్నివీర్ నియామక ప్రక్రియలో భాగంగా సోమవారం నుంచి పోర్టు స్టేడియంలో భారీ ఆర్మీ ర్యాలీ ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 5 వరకూ ఈ నియామక ప్రక్రియకు సంబంధించిన వివిధ రకాల పరీక్షలు నిర్వహించనున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా, తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ, ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఆదివారం రాత్రి నుంచి పోర్టు స్టేడియం వద్దకు చేరుకున్నారు.

అలల మధ్య ఆనందోత్సాహాలు







విశాఖ సాగరతీరం ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. నగరవాసులు మాత్రమే కాకుండా.. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు తీరానికి విచ్చేసి ఉత్సాహంగా గడిపారు. పిల్లలు, యువతీయువకులు సముద్రంలో స్నానం చేస్తూ ఆనందించారు. ఆర్.కె.బీచ్, రుషికొండ బీచ్, మంగమారిపేట బీచ్ వంటి ప్రాంతాలు సందడిగా కనిపించాయి. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ, చిన్నా పెద్దా అందరూ ఎంజాయ్ చేశారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్


విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి



చికిత్స పొందుతూ మృతి చెందిన దీపేష్

అక్కిరెడ్డిపాలెం: మేడపై జీఏ వైరుతో ఆడుకుంటున్న బాలుడు విద్యుత్ షాక్‌కు గురై.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. గాజువాకలోని ఆర్‌హెచ్ కాలనీలో ఈ ఘటన చోటు చేసుకుంది. గాజువాక సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. విజయనగరం జిల్లా గుర్ల మండలం గవిడిపేటకు చెందిన గవిడి త్రినాథరావు.. భార్య, ఇద్దరు పిల్లలు గవిడి దీక్షిత్, దీపేష్(9)తో గాజువాక శ్రీనగర్ దిబ్బపాలెం, ఆర్‌హెచ్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. 20 ఏళ్ల నుంచి స్టీల్‌ప్లాంట్‌లో ఎల్ఎంఎంఎం క్యాంటీన్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. కాగా.. ఆదివారం అతని చిన్న కుమారుడు దీపేష్ ఇంటి మేడపై జీఏ వైర్‌తో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో హైటెన్షన్ వైరుకు జీఏ వైరు తగిలి విద్యుత్ షాక్‌కు గురై పడిపోయాడు. ఇది గమనించిన దీపేష్ బంధువు.. గట్టిగా కేకలు వేశాడు. వెంటనే దీపేష్‌ను అతని తండ్రి దగ్గరలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. త్రినాథరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

వెనక్కి వెళ్లిన సముద్రం



బీచ్‌రోడ్డు: బీచ్‌లో ఎగిసిపడే అలలను చూస్తే పెద్దవాళ్లు కూడా పిల్లల్లా మారిపోతారు. సరదాగా నీళ్లల్లో ఆడుతూ సేదతీరుతారు. అదే అలలు కాస్త వెనక్కి వెళితే.. రోజూ నీళ్లలో మునిగి ఉండే రాళ్లు బయటపడితే.. కొత్త అనుభూతులు ఎదురవుతాయి. ఆదివారం ఆర్కే బీచ్‌లో కాస్త సముద్రం వెనక్కి వెళ్లింది. దీంతో తీరంలోని రాళ్లు బయటపడ్డాయి. బీచ్‌లో సేద తీరేందుకు వచ్చిన జనం ఇది చూసి ఆశ్చర్యపోయారు. రాళ్లపైకి చేరి సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

కమిషనర్ కళ్లకు గంతలు

- తప్పుడు సమాచారంతో మాయచేస్తున్న జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్
- 'సాక్షి' కథనంపై నివేదిక అందించిన పట్టణ ప్రణాళిక
- వాస్తవాలను దాచి పెట్టి అబద్ధాలు అతికించిన వైనం
- ప్లాన్ రెసిడెన్షియల్‌కు పెట్టి.. కమర్షియల్ భవనాన్ని నిర్మిస్తున్న టీడీపీ నేత
- ఫైన్ వేశామంటూ రెవెన్యూ విభాగం చేసిన పనిని చెప్పిన అధికారులు



జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కాపాడుతున్న అక్రమ కట్టడమిదే..

సాక్షి, విశాఖపట్నం : తాము అనుకుంటే.. తిమ్మిని బమ్మిని చేస్తామన్నట్టుగా వ్యవహరిస్తున్నారు మహా విశాఖ నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు. ప్లాన్‌కు విరుద్ధంగా అడ్డగోలుగా నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని కాపాడేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. 'సాక్షి'లో కథనం రాగానే తమ తప్పులను ఒప్పులుగా చూపించేందుకు నానాపాట్లు పడుతున్నారు. వాస్తవాలను తుంగలో తొక్కుతూ ఏకంగా కమిషనర్ కళ్లకు గంతలు కట్టేశారు. ఆ భవన నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగానే జరిగిందని చెబుతూ దాన్ని సరిచేశామంటూ అబద్ధాల నివేదికను అందించారు. పాపం క్షేత్రస్థాయిలో ఏం జరిగిందో తెలియని కమిషనర్ అవే వాస్తవాలని.. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది చెప్పిందే నిజమని నమ్మే పరిస్థితి కనిపిస్తోంది.

కలరింగ్ ఇచ్చేందుకు నానా తంటాలు

అక్రమాల అంతస్తులు కనిపిస్తుంటే తమ జేబులు నింపేసుకొని అడ్డగోలు అనుమతులు ఇచ్చేస్తున్న జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు అవినీతి వ్యవహారంపై ఈ నెల 6న సాక్షిలో 'అవినీతి పునాదులపై పైసావసూల్' శీర్షికతో కథనం ప్రచురితమైంది. జోన్–5 పరిధిలో ఓ బిల్డర్ నిర్మిస్తున్న భారీ భవనం పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా జరుగుతుందన్న విషయాన్ని బట్టబయలు చేయగా.. దీనిపై టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ఉలిక్కిపడ్డారు. రూ.లక్షలకు పైగా డబ్బులు వసూలు చేసుకొని కళ్లు మూసుకున్న వ్యవహారం బయటకు రావడంతో దాన్ని కప్పిపుచ్చుకోవడానికి అబద్ధాలు వల్లెవేస్తున్నారు. జోన్–5 టౌన్‌ప్లానింగ్ అధికారి కనుసన్నల్లో జరిగిన ఈ బాగోతంపై జీవీఎంసీ కమిషనర్ సీరియస్ అవ్వగా.. అబ్బే అదేం లేదు సార్ అంతా సక్రమమేనంటూ కలరింగ్ ఇచ్చేందుకు నానా తంటాలు పడుతూ నివేదిక ఇచ్చారు.

టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇచ్చిన వివరాలేంటి అందులో ఉన్న లొసుగులేంటో ఓసారి పరిశీలిద్దాం..

స్టిల్ట్ జి ప్లస్ 2కి పర్మిషన్ తీసుకున్నారు. అయితే బిల్డింగ్ సెట్‌బ్యాక్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా కట్టారు.

వాస్తవం: పర్మిషన్ తీసుకున్నదీ, సెట్ బ్యాక్ లేకుండా నిర్మించిందీ మాట వాస్తవమే. కానీ అందులో ప్లస్–2కి పర్మిషన్ తీసుకొని అదనపు ఫ్లోర్ నిర్మించారు. ఈ విషయాన్ని కమిషనర్‌కు చెప్పకుండా దాచిపెట్టారు. కారణం ఇది చాలా పెద్ద తప్పు. అదనపు ఫ్లోర్ నిర్మిస్తే వెంటనే కూల్చేయాలి. కూల్చేయకుండా సదరు బిల్డర్ నుంచి రూ.లక్షలు వసూలు చేసి దిగువ స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకూ వాటాలు పంచుకున్నారు. అందుకే ఈ అడిషనల్ ఫ్లోర్ గురించి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లకుండా వాస్తవాన్ని కప్పేశారు.

టౌన్‌ప్లానింగ్ సిబ్బంది స్వయంగా తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారని గుర్తించాం. బిల్డింగ్ నిర్మాణ దశలో ఉన్న సమయంలో ఈ ఏడాది ఫిబ్రవరి 8న నోటీసులు ఇచ్చాం. తర్వాత యజమాని డీవియేషన్ చేసినందుకు ఆస్తిపన్ను నిబంధనలకు అనుగుణంగా అసెస్‌మెంట్ ప్రకారం 100 శాతం విధించాం.

వాస్తవం: సెట్‌బ్యాక్ డీవియేషన్, అదనపు ఫ్లోర్ నిర్మిస్తున్నట్లు టౌన్‌ప్లానింగ్ దృష్టికి వెళ్లినప్పుడు ఆ తప్పులను సరిదిద్దుకోవాలని మొదటి నోటీస్ ఇస్తారు. సరిదిద్దుకోకపోతే రెండో నోటీస్ ఇచ్చి ఆ తప్పును సరిదిద్దుకోలేదు.. మీ అంతట మీరే అదనపు ఫ్లోర్ తొలగించకపోతే మేమే పడగొట్టేస్తామని నోటీసులిస్తారు... అప్పటికీ మారకపోతే కూల్చేయ్యాలి. కానీ టౌన్‌ప్లానింగ్ అధికారులు.. సదరు బిల్డర్‌పై అవాజ్య ప్రేమ చూపించారు. రెండో నోటీస్ అనేదే ఇవ్వకుండా భవన నిర్మాణం దగ్గరుండి మరీ పూర్తి చేయించారు. ఇక పన్ను విధించామని గొప్పగా చెప్పుకుంటున్నారు. ట్యాక్స్ అనేది రెవెన్యూ విభాగం వ్యవహారం. భవనం పూర్తయితే రెవెన్యూ విభాగం పరిశీలించి.. ప్లాన్ ప్రకారం నిర్మించారా లేదా.? ఆక్యుపేషన్ సర్టిఫికెట్(ఓసీ) ఉందా లేదా.? అని పరిశీలించి పన్ను విధిస్తారు. దీనికి టౌన్‌ప్లానింగ్‌కు సంబంధం లేదు. కానీ అది మేమే చేశామంటూ కమిషనర్‌కు కహానీలు చెప్పారు.

భవనానికి ప్లాన్ ఉంది

వాస్తవం : ఈ భవన నిర్మాణానికి ప్లాన్ ఉంది. కానీ సదరు బిల్డర్ బిల్డింగ్ ప్లాన్ రెసిడెన్షియల్‌కు తీసుకొని కమర్షియల్ భవనాన్ని నిర్మిస్తున్నారు. దీన్ని కూడా జోన్–5 టౌన్‌ప్లానింగ్ అధికారులు కమిషనర్ దృష్టికి రాకుండా తప్పుడు నివేదిక అందించేశారు.

ఇలా.. ఒక్క అడ్డగోలు భవన నిర్మాణంలోనే ఒక్కొక్కరూ లక్షల రూపాయలు ఆర్జించిన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది.. అవసరమైతే.. తమ అక్రమ సంపాదనని కాపాడుకునేందుకు ఎంతకైనా దిగజారుతారన్నది ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. ఓ వైపు కమిషనర్ టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో ప్రత్యేక సమావేశాలు పెట్టి హెచ్చరిస్తున్నా మమ్మల్నెవరూ ఏం చెయ్యలేరు అనే ధీమాతో జోన్ సిబ్బంది నుంచి ప్రధాన కార్యాలయంలో ఉన్న ఉన్నతాధికారి వరకూ హెచ్చరికలు బేఖాతరు చేస్తున్నారు.